ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 16 మే 2025



సరస్వతి నమస్తుభ్యం..

- కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభం
- పుష్కర సాన్నమాచరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- తొలిరోజే పోటెత్తిన భక్తులు

7

రామగుండంలో రూ.53.43 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి

కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష



కోల్‌సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.58.43కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.9.64 కోట్లు, ఎల్‌ఆర్‌ఎస్ వడ్డీ సొమ్ము రూ.84 లక్షలు, 14 ఆర్థిక సంఘం రూ.50లక్షలు, టీయూఎఫ్ఐడీసీ కింద రూ.45 కోట్లు, ప్రత్యేకాభివృద్ధి నిధులు రూ.1.84కోట్లు, వరద సహాయ నిధులు రూ.65లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో నగరంలో సీసీ రోడ్లు నూతన డ్రైన్ నిర్మాణం పనులు పూర్తి చేశామని, పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా 15 ఆర్థిక సంఘం నుంచి రూ.80లక్షలతో 8ట్రాక్టర్లు, రూ.65లక్షలతో 8ట్రాలీలు, రూ.47లక్షలతో 5చెత్త తరలింపు ట్రాక్టర్లు, రూ.76లక్షలతో రెండు ఎక్స్‌కావేటర్లను కొనుగోలు చేశామన్నారు. పారిశుధ్య సిబ్బందికి రూ.4.5లక్షలతో భద్రత సామగ్రిని సమకూర్చామన్నారు. రూ.83లక్షలతో డ్రై రిసోర్స్ సెంటర్‌ను నిర్మించామన్నారు. ఫైవింక్లయిన్ వద్ద రూ.1.43కోట్ల నిధులు వెచ్చించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. రూ.4కోట్లతో నగరంలో నీటి సరఫరా కనెక్షన్లు, అవసరమైన డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ పనులు పూర్తి చేశామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ వడ్డీ సొమ్ము రూ.45 లక్షలతో ఎల్‌ఈడీ లైట్లు, రూ.36లక్షలతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. 352 కొత్త విద్యుత్ స్తంభాలు వేసినట్లు కలెక్టర్ తెలిపారు. రూ.65లక్షల వరద సహాయ నిధులతో మ్యాన్ హోల్స్ మరమ్మతులు పూర్తి చేశామన్నారు.

అనాథ యువతి వివాహానికి కలెక్టరే పెళ్లి పెద్ద

- జిల్లా అధికారుల పేర్లతో వివాహ ఆహ్వాన ప్రతిక

7



- ఎమ్మెల్యేల చొరవతో దిగివచ్చిన ధర
- ట్రాక్టర్ లోడుకు రూ.1000 నుంచి రూ.1300
- నిర్మాణదారులకు ఊరట

జిల్లాలో ఇసుక కష్టాలు తీరాయి. గతంలో స్యాండ్ ట్యాక్సీ బుక్ చేస్తే రూ.3500ల నుంచి 4 వేల వరకు ఖర్చయ్యేది. వరుస క్రమంలో సరఫరా చేయడంతో అవసరమైన సమయంలో ఇసుక లభించేది కాదు. ఎమ్మెల్యేల చొరవతో ప్రస్తుతం ట్రాక్టర్ లోడుకు రూ.1000 నుంచి రూ.1300 వరకు ఇసుక లభిస్తోంది. దీంతో నిర్మాణదారులకు ఊరట లభించింది.

తీరిన ఇసుక కష్టాలు

కోల్‌సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): రామగుండం అర్బన్‌లో గతంలో స్యాండ్ ట్యాక్సీతో పాటు ముర్మూర్ ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలించేవారు. నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు చెన్నూరు గోదావరి, మానేరు క్వారీల నుంచి ఇసుక తెప్పించుకునేవారు. ఇసుకకు డిమాండ్ భారీగా ఉండ డంతో రామగుండం, ఇందారం తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా రవాణా జరిగేది. ఈ అక్రమ రవా ణాలో లక్షల రూపాయలు చేతులు మారడంతో విని యోగదారులపై భారం పడేది. ఈ విషయంలో ట్రాక్టర్ల యాజమానుల మధ్య గొడవలతో రవాణా సైతం నిలిచిపోయింది. కొన్ని సందర్భాల్లో ఇసుక అందుబాటులో లేక నిర్మాణాలు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇసుక మాఫియా కనుసన్నల్లోనే అధికార యంత్రాంగం పని చేసే పరిస్థితి ఏర్పడింది. ఇద్దరు అధికారులు సైతం ఏసీబీకి పట్టుబడ్డారు. మరి కొందరిపై క్రమశిక్షణ వేటు పడింది.

ఎమ్మెల్యే చొరవతో తగ్గిన ధర

జిల్లాలో ఇసుక ధరలను నియంత్రించేందుకు ఎమ్మెల్యేలు చొరవ చూపారు. రామగుండంలో గోదావరి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. రామగుండం అవసరాలకు మాత్రమే గోదావరి నుంచి ఇసుక తీసుకునేలా చర్యలు చేపట్టారు. గోదావరిఖని, ఎన్‌టీపీసీ, జనగామ ప్రాంత ట్రాక్టర్ల యజమానులు గోదావరి నుంచి ఇసుకను తీసుకు వచ్చి అర్బన్ ఏరియాలో రవాణా చేస్తున్నారు. రామగుండం పట్టణంలో లింగాపూర్, రామగుండం ప్రాంత ట్రాక్టర్లు, గోదావరిఖనిలో పట్టణ పరిధివారు, ఎన్‌టీపీసీ, ఎఫ్‌సీఐ ఏరియాల్లో ఎన్‌టీపీసీ ప్రాంత ట్రాక్టర్ యజమానులు ఇసుక రవాణా చేస్తు న్నారు. గంగానగర్, పవర్‌హౌస్‌కాలనీ, సప్తగిరికాలనీ ప్రాంతాల్లో రూ.1000 నుంచి రూ.1100 ట్రిప్పు పోస్తున్నారు. దూరాన్ని బట్టి పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో రూ.1200 నుంచి రూ.1300లకు సరఫరా చేస్తున్నారు. నిర్మాణదారులు వర్షాకాలంలో సైతం ఇబ్బందులు కలు గకుండా ఇండ్ల వద్ద ఇసుక నిల్వ చేసుకుంటున్నారు. ట్రాక్టర్ల యజమానులే గిరాకీల కోసం నిర్మాణదారుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇసుక రేటు తగ్గడంతో దీని ప్రభావం మట్టిపై పడింది. మట్టి కూడా రూ.1000 నుంచి రూ.1400 వరకు ట్రిప్పు లభి స్తోంది. నిర్మాణదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎలిగేడు (ఆంధ్రజ్యోతి): ఇసుక ధర తగ్గడంతో సామాన్య ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. సుల్తానాబాద్ మండలం లోని గర్రెపల్లి, నీరుకుళ్ల, గట్టెపల్లి, కదంబాపూర్ ప్రాం తాల్లోని మానేరు వాగు నుంచి ఎలిగేడు, జూలపల్లి తోపాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ట్రాక్టర్ రూ.2000 వరకు నిర్ణయించి వరుస క్రమంలో ఇసుకను అందించేవారు. ఇసుక ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండడం వల్ల ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకున్న ఇసుక వ్యాపారులు అధిక ధరలతో విక్రయిం చేవారు.

ఇంటి నిర్మాణంలో ఇసుక భారం కాకూడదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఎన్నికల ముందు ఇసుక, మట్టిని అమ్ముకుంటూ పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టగానే అధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించి ఇసుక ధర తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుకకు వెయ్యి రూపాయలకు లభిస్తుండడంతో నిర్మాణదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక భవనం నిర్మాణానికి 20నుంచి 30ట్రిప్పుల ఇసుక అవసరం పడుతుండగా ఇప్పుడు ధర ప్రకారం లబ్ధిదారులకు గతంతో పోలిస్తే రూ.50వేల వరకు మిగులు తున్నాయి. ఇసుక ధరలు తగ్గడంతో గ్రామాల్లో నిర్మాణాలు పెరగడంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి.

పెరుగుతున్న వలస కార్మికులు

గ్రామాల్లో పనులు లేక ఇబ్బంది పడుతున్న తాపీ మేస్త్రీలు కూలీలకు వలస వచ్చిన కార్మికుల వల్ల పోటీ పెరిగింది. మిగతా 8వ పేజీలో

రైల్వే స్టేషన్లను సందర్శించిన డీఆర్‌ఎం

అంతర్గాం, మే 15(ఆంధ్రజ్యోతి): రామగుండం రైల్వేస్టేషన్‌ను గురువారం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ భరతేష్‌కుమార్ సందర్శించారు. డీఆర్‌ఎం రైల్వేస్టేషన్ పరిధిలో విద్యుత్ ఉపకేంద్రంతోపాటు వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు రైల్వే సంస్థ నిరంతర కృషి చేస్తుందని పేర్కొన్నారు. కుందనపల్లి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డీఆర్‌యూసీసీ మెంబర్ జీన్స్ అనూమన శ్రీనివాస్ డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. రైల్వే కాంట్రాక్టు కార్మి కులకు జీవో ప్రకారం వేతనాలు అందజేయాలని సీఐటీయూ నాయకులు ఎం.రామాచారి వినతిపత్రం అందజేశారు. అధికారులు సురేష్‌రెడ్డి, బాలాజీ, కిరణ్, కార్తీక్, మునిరాం మీనా, పాపారావు, పాల్గొన్నారు.



డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్‌ను దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ సందర్శించారు. పెద్దపల్లిలో సూపర్ ఫాస్ట్ రైళ్ళు నిలుపాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ఉపాధ్యక్షుడు అజయ్ కాంతి సింగ్, ఎగ్జిక్యూటివ్ సభ్యు డు దేవిసింగ్ ఠాకూర్‌లు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ సూపర్ ఫాస్ట్, స్వర్ణ జయంతి, భగత్ కోటి రైళ్ళను నిలుపుతామని మేనేజర్ హామీ ఇచ్చారన్నారు. వీటితోపాటు ప్రస్తుతం బల్లార్షా నుంచి కాజీపేట ఎక్స్‌ప్రెస్ రైలును చర్లపల్లి వరకు పొడిగించాలని కోరారు. తిరుపతి నుంచి కరీంనగర్ బై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నిజామాబాదు వరకు పొడిగించాలని, అలాగే పెద్దపల్లి బైపాస్ వద్ద నూతన రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఓసీపీ-2 బ్లాస్టింగ్‌లతో దద్దరిల్లిన నాగేపల్లి సీ-బ్లాక్

- రోడ్డెక్కిన బాధితులు
- పలు గృహాలు పాక్షికంగా ధ్వంసం
- పలువురికి స్వల్పగాయాలు



మంథని-పెద్దపల్లి రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

రామగిరి, మే 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 డైవర్ట్ కెనాల్‌లో గురువారం చేపట్టిన బ్లాస్టింగ్‌తో నాగేపల్లి సీ-బ్లాక్ ఒక్కసారిగా దద్దరిల్లింది. ప్రాజెక్టు ఓబి కుప్పలకు ఆనుకొని ఉన్న నాగేపల్లి సీ-బ్లాక్‌లో సింగరేణి చేపట్టిన భారీ పేలుళ్ళతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పేలుళ్ళకు పెద్ద, పెద్ద బండరాళ్ళు సి-బ్లాక్‌లో ఉన్న పలు గృహాలపై పడ్డాయి. వేగంగా వచ్చిన రాళ్ల ఇంటిపై కప్పు రేకులు పగిలి ఇంట్లో పడ్డాయి. రాళ్ళు ధాటికి పలువురు స్వల్పంగా గాయపడ్డారు. తొలుత భూకంపంగా భావించిన గ్రామస్థులు పరుగులు పెట్టారు. ఇంట్లో ఉండే గృహోపకరణలు సైతం రాళ్ళ ధాటికి పగిలిపోయాయి. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేపట్టారని గ్రామస్థులు పెద్దపల్లి- మంథని ప్రధాన రహదారి పై సుమారు గంటపాటు రాస్తారోకో చేపట్టారు. సింగరేణికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, రామగుండం ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ రాజు, ఎస్ఐ చంద్ర కుమార్‌లు ఘటన స్థలానికి చేరుకొని బ్లాస్టింగ్‌లతో దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశ మయ్యారు. సింగరేణి యాజమాన్యం తరుపున అధికారుల బృందం ఏర్పాటు చేసి నష్టపోయిన బాధితులకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేయిస్తామని జీఎం సుధాకర్‌రావు హామీనిచ్చారు. గాయపడిన వ్యక్తులకు స్థానికంగా వైద్య పరీక్షలు చేయించారు. గృహోపకరణలను సైతం కల్పిస్తామని హామీ నిచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.



గ్రామస్థులను సముదాయిస్తున్న ఏసీపీ రమేశ్

ఆయిల్ పామ్ లక్ష్యాలను చేరుకోవాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను ప్రణాళికబద్ధంగా చేరుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయిల్ పామ్ లక్ష్యాలపై జి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంటకు కోతుల బెడద ఉండదని, వరదలు వచ్చినా సమస్య ఉండదని, 4 సంవత్సరాల వరకు అంతర్ పంటల ద్వారా ఆదాయం వస్తుందన్నారు. క్లస్టర్ పరిధిలో ఉన్న రైతులను ముందుగా సంప్రదించి వారికి ఉన్న భూమిలో కొంత భాగంలో ఆయిల్‌పామ్ సాగు చేసేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. 2025-26లో జిల్లాలో 25 వందల ఎకరాల ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యం సాధనకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 13 వందల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు రైతులను గుర్తించామని, 750 ఎకరాల రైతులు ఆయిల్ ఫామ్ మొక్కలకు సంబంధించిన డీడీలు చెల్లించారని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత సంవత్సరం ఆయిల్ పామ్ సాగుకు డీడీలు తీసిన రైతులు వచ్చే వానాకాలం ఇతర పంటలు వేయకుండా జాగ్రత్త వహించాలని, రైతుల నుంచి డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు డీడీలు స్వీకరించి చర్యలు చేపట్టాలన్నారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు జిల్లాలో 15 వందల ఎకరాలలో ఆయిల్ సాగు విస్తరణం జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు అవసరమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ, ఆయిల్ పామ్ పంట సాగుతో వచ్చే ఆదాయం సంబంధిత అంశాలపై రైతులకు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్య ఆరోగ్య సిబ్బందిని సూచించారు. గురువారం జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ హబ్, ఆయుర్వేద హోమియో సెంటర్, ఆయుష్మాన్ భారత్ వెల్ నెస్ సెంటర్, మాతా శిశు ఆసుపత్రిలో ఉన్న డెంటల్ సెంటర్, కంటి విభాగం, గర్భిణీల వార్డు, ల్యాబ్, ఆరోగ్య మహిళా కౌంటర్, 2డి ఎకోరూం, వివిధ ఓపి రూమ్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, డయాగ్నొస్టిక్ హబ్ వద్ద అన్ని రకాల వైద్య పరీక్షలు జరగాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ సంఖ్య పెరగాలని, దీనికి జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామన్నారు. మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు కూర్చునే విధంగా కుర్చీలు వేయాలని, ఓపి రూమ్ వద్ద సీటింగ్ పెంచాలని సూచించారు. ఆసుపత్రిలో రోగుల వీలుగా రెండు మూడు ప్రదేశాలలో టీవీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్ఎంవో డాక్టర్ విజయ్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రాంభించారు. ప్రభుత్వ ఐటీఐ మైదానంలో ప్రహరీ నిర్మాణానికి రూ.6 లక్షల 30వేలు, అలాగే డ్రైనేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.14 లక్షలతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పబ్లిక్ టాయిలెట్ నిర్మాణం, ట్యాంక్ బండ్ (ఎల్లమ్మ గుండమ్మ చెరువు) పై రూ.13 లక్షలు మొత్తం 43 లక్షల 30 వేల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు త్వరలోనే వాకింగ్ ట్రాక్, చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ హాస్పిటల్ వద్ద పబ్లిక్ టాయిలెట్, మినీ ట్యాంక్‌బండ్‌పై పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తామన్నారు. పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి అడగగానే నిధులు కేటాయిస్తున్నారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు ఐటీఐ మైదానంలో నూతనంగా 8 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన ఏటీసీ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, అధికారులు

గోదావరిఖని, మే 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జవహర్‌నగర్ సింగరేణి స్టేడియంలో ఈనెల 18న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్లోబల్ ఎడ్యుకేషనల్ ఎంప్లాయిమెంట్ అసోసియేషన్, సింగరేణి సంయుక్తంగా మేళాను నిర్వహిస్తుందన్నారు. వందకు పైగా సంస్థలు పాల్గొంటుండగా 3వేలకుపైగా ఉద్యోగాల భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా, ఐటీఐ తదితర అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత పాల్గొనవచ్చునన్నారు. మెడికల్ కళాశాల, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ, సింగరేణితోపాటు హైదరాబాద్‌లోని పలు సంస్థల్లో నిరుద్యోగులకు అవకాశాలు కల్పించానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 18న జరిగే జాబ్‌మేళాకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయని, నిరుద్యోగులు బయోడేటా, అర్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు 9491144252ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీఎంలు లలిత్‌కుమార్, బండి వెంకటయ్య, ఏసీపీ రమేష్, కిరణబాబు, నాయకులు రాజేష్, మహంకాళి స్వామి, శ్రీనివాస్, తానిపర్తి గోపాల్‌రావు, పాల్గొన్నారు.

లంచం అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేయండి



కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థ ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావు లేకుండ సేవలు అందిస్తు న్నదని కమిషనర్, అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ పేర్కొన్నారు. గురు వారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్ణీత వ్యవధి లోనే ఫిర్యాదుల పరిష్కారం, ధ్రువీ కరణ పత్రాల జారీ వంటి సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. అధికారులు, సిబ్బంది నిజాయితీగా, సమర్థవంతంగా సేవ లందిస్తున్నప్పటికీ ఏమైనా లోపాలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావా లన్నారు. లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064, మొబైల్ నెంబర్ 9440446106కు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. ఈ మేరకు కార్యాలయంలో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన చట్టు కనకరాజు(50) బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కనకరాజు జీవనోపాధి కోసం కొంత కాలం కిందట విదేశాలకు వెళ్లి ఆరునెలల కిందటే గ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. భార్యాపిల్లలతో నిత్యం గొడవపడేవాడు. బుధవారం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. మళ్లీ ఇంటి నుంచి బయటకు వెళ్లి మద్యం తాగి వచ్చాడు. రాత్రి 8గంటలకు గదిలోకి వెళ్లిన కనకరాజు మద్యంమత్తులో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కనకరాజు భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మలేషియాలో హబ్సీపూర్ వాసి మృతి

జగిత్యాలరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన కారం నర్సయ్య అనే గల్ఫ్ కార్మికుడు మలేషియాలో మృతిచెందినట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీకమిటీ ప్రతినిధి మంద భీంరెడ్డి తెలిపారు. నర్సయ్య 23 ఏళ్లుగా మలేషియాలో ఉంటున్నాడు. ఐదునెలలుగా ఎలాంటి సమాచారం లేకపోవడంతో కుటుంబీకులు మాజీమంత్రి జీవన్‌రెడ్డిని కలిశారు. స్పందించిన మాజీమంత్రి ఆయన ఆచూకీ కనిపెట్టాలని ఎన్ఆర్ఐ అడ్వైజరీని కోరాడు. మలేషియాలోని మార్చురీలో నర్సయ్య మృతదేహం ఉన్నట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వారు గుర్తించారు. ఎప్పుడు, ఎలా మృతిచెందాడనే వివరాలు తెలియాల్సి ఉంది.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


రాజీవ్‌గాంధీ(ఫైల్)

ఎలిగేడు, మే 15 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతోకలిసి ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో బుధవారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం జరిగింది. గోదావరిఖనిపట్టణం జైభీమ్ నగర్‌కు చెందిన ముస్కె రాజీవ్‌గాంధీ(35) స్నేహితులతోకలిసి ముప్పిరితోటలో రథోత్సవంలో పాల్గొన్నాడు. అనంతరం సరదాగా ఈత కొట్టేందుకు సాయంత్రం వ్యవసాయ బావిలోకి దిగాడు. రాజీవ్‌గాంధీకి ఈత రాకపోవడంతో బావిలో గల్లంతయ్యాడు. స్నేహితులు స్థానికులకు సమాచారం అందించడంతో బావిలో ఆచూకీకోసం వెతికారు. గురువారం పోలీసులు, పెద్దపల్లి, గోదావరిఖనికి చెందిన రెస్క్యూటీంతో బావిలో వెతుకగా మృతదేహాన్ని లభ్యమైంది. మృతుడు సింగరేణిలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడికి తల్లితోపాటు అక్క,చెల్లి ఉన్నారు. గతంలో తండ్రి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

వేములవాడ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): నీటిసంపులో పడి చిన్నారి మృత్యువాత పాడిన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెందిన జిక్రా ఫాతిమా(4) అనే పాప ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యలోనే పాప మృతిచెందినట్లు వైద్యాధికారులు వెల్లడించారని తెలిసింది. ఈ సంఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● మరో ఇద్దరికి గాయాలు


మృతిచెందిన ప్రశాంత్ బెహారీ

రామడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని చిప్పకుర్తి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకయువకుడు దుర్మరణం చెందగా, మరోఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. సుశాంత్ బెహారీ బైక్‌పై.. మరో ఇద్దరు ప్రశాంత్ బెహారీ(21), తోకల్ శరత్‌చంద్రతో కలిసి కరీంనగర్ నుంచి గోపాల్‌రావు పేటకు వెళ్తున్నారు. అతివేగంగా అజాగ్రత్తగా బైక్ నడిపిన సుశాంత్ బెహారీ చిప్పకుర్తివద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సిమెంట్ బెంచ్‌ని ఢీకొట్టాడు. దీంతో ప్రశాంత్‌బెహారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలు కాగా వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. శరత్‌చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ సతీష్ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యంసేవించి వాహనం నడిపినవ్యక్తికి జగిత్యాలసెకండ్‌క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కరుణాకర్ ఒకరోజు జైలుశిక్ష విధించారు. రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామానికి చెందిన అల్లెపు వెంకటనర్సయ్య(49) అతిగా మద్యం సేవించి వాహనం నడుపగా రాయికల్ ఎస్సై సుధీర్ పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారించిన జడ్జి నర్సయ్యకు ఒక రోజు జైలు శిక్ష విధించారు.

డెంగ్యూతో జాగ్రత్త

● నివారణ చర్యలపై ప్రభుత్వ ప్రచారం

● నేడు జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం



జగిత్యాల/సుభాష్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): 'దోమలు పుట్టకుండా చూసుకుందాం... దోమలు కుట్టకుండా చూద్దాం... డెంగ్యూ వ్యాధిని తరిమికొడుదాం' ఇవీ డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రభుత్వ ప్రచార స్లోగన్స్. ప్రమాదకరమైన డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ ఇటీవల ప్రభుత్వం వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టింది. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రచారం నిర్వహించడంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో డెంగ్యూ వ్యాధి నియంత్రణ, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

దోమకాటుతోనే..

డెంగ్యూకి కారణమయ్యే ఫ్లేవీ వైరస్‌లు ఆడ ఏజిస్ ఈజిప్టై దోమ కుట్టడం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. ఈ వైరస్‌లలో నాలుగు రకాలున్నాయి. ఒక రకం వైరస్‌తో ఒకసారే డెంగ్యూ వస్తుంది. ఇతర రకాల వైరస్‌లతో మరోసారి రావొచ్చు. అంటే ఒకరికి జీవితంలో గరిష్ఠంగా నాలుగు సార్లు డెంగ్యూ వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రెండో సారి, మూడోసారి మరో రకం వైరస్‌తో జ్వరం వస్తే మాత్రం చాలా తీవ్రంగా ఉంటుంది.

లక్షణాలు ఏమిటి?

దోమ కుట్టిన తర్వాత 3 నుంచి 14 రోజుల్లోపు ఎప్పుడైనా డెంగ్యూ ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. తొలి, విషమ దశలను బట్టి లక్షణాలు కనిపిస్తాయి. తొలిదశలో హఠాత్తుగా తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కళ్ల వెనకాల నుంచి నొప్పి, కళ్లు ఎర్రగా మారడం, ఉబ్బడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాంతి, వికారం, ఆకలి మందగింపు, చర్మం మీద ఎర్రటి దద్దుర్లు, దురద వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా ఛాతీ మీద మొదలై చేతులు, కాళ్లు, ముఖానికి వ్యాపిస్తుంది. విషమ దశలో పొట్ట ఉబ్బడం, పొట్టలో నొప్పి, ఆయాసం, బీపీ పడిపోవడం, కాళ్లు చేతులు చల్లబడడం, చికాకు, మగత, చిగుళ్ల వంటి భాగాల నుంచి రక్తం కారడం, చర్మం మీద ఎర్రటి చుక్కల్లాంటి మచ్చలు ఏర్పడడం వంటివి కనిపిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే మేలు

ఇంటితోపాటు ఆవరణలో నీటి కుండీలు, డ్రమ్ములు, గోళాలు వంటి ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి. కనీసం వారానికి ఒకసారి నీరు నిలువ చేసే పాత్రలను ఖాళీ చేయాలి. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో నీటి గుంటలు లేకుండా చూడాలి. ఇంటిపై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులపైన దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి. సెప్టిక్ ట్యాంకు గొట్టం, గ్యాస్ పైప్‌లైన్ పైన పలుచని బట్ట చుట్టాలి. దీంతో దోమల నివారణ చేపట్టవచ్చు. మురికి కాలువల్లో చెత్తచెదారం తొలగించి మురుగు నీరు పారే విధంగా చూడాలి. కాలువల్లో చెత్తా చెదారం, చెట్లకొమ్మలు వేయరాదు. పనికి రాని సీసాలు, డబ్బాలు, రబ్బరు టైర్లు, వాటర్ కూలర్స్ తది తర పాత్రలపైనా నీరు నిలువ లేకుండా చూడాలి. వాటిలో నీరు నిలిచిన వారం రోజుల్లో దోమలు పెరిగే అవకాశం ఉంది. దోమ తెరలు, ఇంటి కిటికీలకు జాలీలు వాడడం, వస్త్రధారణ, దినచర్యల్లో మార్పులు, దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి. రసాయ నాలతో పొగబెట్టడం, ఇళ్లలో మందులు చల్లడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రచారం చేస్తోంది.




అప్రమత్తంగా ఉండాలి..

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, జగిత్యాల



అప్రమత్తతోనే డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చు. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకొని డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రయత్నాలు చేయాలి.



ప్లేట్ లెట్స్ లెక్కింపు

డెంగ్యూ జ్వరంలో అందరికీ ప్లేట్ లెట్లు ఎక్కించాల్సిన అవసరం ఉండదు. ప్లేట్ లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఎక్కిస్తారు. ప్లేట్ లెట్స్ 50 వేల కన్నా పడిపోతే ఆసుపత్రిలో చేర్చాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్ లెట్స్ 20 వేల కన్నా తగ్గి, రక్తస్రావం లక్షణాలు కనిపిస్తే బయట నుంచి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అదే 10 వేలకు పడిపోతే రక్తస్రావం ఉన్నా, లేకున్నా ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని సూచిస్తున్నారు.

పరీక్షలు, చికిత్స

డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికిగానీ, దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి గానీ తీసుకెళ్లాలి. తగిన వైద్య పరీక్షలు చేసుకొని చికిత్స పొందాలి. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు ఎలీసా పరీక్ష ఉత్తమమైన ప్రామాణికంగా తీసుకుంటారు. బ్రూఫెన్ వంటి నొప్పి నివారణ మందులు వాడరాదు. ద్రవ పదార్థాలు, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు ఎక్కువగా తాగాలి.

అర్ధరాత్రి ఇంట్లోకి దూరి బంగారు గొలుసు చోరీ

మానకొండూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితురాలి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామంచ పోచమ్మ(85) అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. రాత్రి ఆమె నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగుడు తులుపులు పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమెపై దాడిచేసి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. వృద్ధురాలు కేకలు వేయడంతో ఆమె నోటిని గట్టిగా ఒత్తడంతో రెండు పళ్లు ఊడిపోయాయి. గురువారం ఆమె పెద్ద కుమారుడు రామంచ మల్లయ్య ఫిర్యాదు చేయడంతో సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోపాల్‌రావుపేటలో రెండిళ్లలో చోరీ

●బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రామడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో దొంగలు తాళంవేసిన ఇళ్లల్లోప్రవేశించి నగదు, బంగారు, వెండిఆభరణాలను అపహరించుకువెళ్లారు. బాధితులకథనం ప్రకారం.. గోపాల్‌రావుపేటకు చెందిన నల్ల శ్రీనివాస్, ఎగుర్ల బీరయ్య ఇళ్ల పక్కపక్కనే ఉన్నాయి. అయితే ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం వేములవాడకు వెళ్లారు. ఒకరి ఇల్లు తర్వాత మరో ఇంటిలో ప్రవేశించిన దొంగలు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నగదు, బంగారం చోరీ చేశారు. ఈసందర్భంగా బీరయ్య ఇంట్లో లక్ష రూపాయల నగదు, 70తులాల వెండి, అలాగే శ్రీనివాస్ ఇంట్లో రూ.60వేలనగదు, నాలుగున్నర తులాల బంగారుఆభరణాలు అపహరించినట్లు తెలిపారు. గురువారం ఉదయం వారు ఇంటికి రాగా దొంగతనం జరిగినట్లుగ్రహించి పోలీసులు సమాచారం అందించారు. దీంతో ట్రైనీఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో ఫింగర్‌ప్రింట్ నిపుణులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కాల్వశ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదిలాపూర్ గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. వారివద్ద నుంచి 1,28,780 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. రామకృష్ణాపూర్‌కు చెందిన మారేపల్లి సతీష్‌కుమార్, మంచిర్యాలకు చెందిన పుప్పాల రవి, ఖిలా వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండీ. జావీద్, రాపాని శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా తాండూరుకు చెందిన గంగాధర్, పెద్దపల్లికి చెందిన పిడుగు రమేష్‌లు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

● ఆరుగురు అరెస్టు...

● రూ. 8800 స్వాధీనం

శంకరపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గద్దపాకలో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8800 నగదు స్వాధీనం చేసుకొని వారిని కేశవపట్నం పోలీసులకు అప్పగించారు. వారిపై కేశవపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో రాచర్లగొల్లపల్లికి చెందిన అభినవ్, భరత్‌లు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అభినవ్, భరత్‌లు కలిసి రాచర్లగొల్లపల్లి వైపుకు వెళుతున్న క్రమంలో బైక్, కారులు ఢీకొన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు..

తంగళ్లపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామ శివారులో పాదచారులను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సిద్దిపేట జిల్లా చెందిన సుమారు 20మంది హనుమాన్ భక్తులు కాలినడకన కొండగట్టుకు వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో సిద్దిపేట జిల్లాకు చెందిన కన్నబోయిన ప్రశాంత్, పందిళ్ల సురేష్‌తో పాటు తంగళ్లపల్లి మండలం బాలమల్లు పల్లె గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు కస్తూరి నారాయణ రెడ్డి గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సన్నవడ్లు కొనాలని రోడ్డెక్కిన రైతులు

● రైతులను దూషించిన ఆలయ చైర్మన్

● ఆగ్రహంతో చితకబాదిన రైతులు


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

పెద్దపల్లి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యం పండిస్తే బోనస్ ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో రైతులు కొంతమేర సన్న రకాలను పండించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురాగా నెల రోజులు గడిచినా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంపై రైతులు రోడ్డెక్కారు. అటుగా వెళ్తున్న ఓ ప్రజా ప్రతినిధి సంఘటన స్థలానికి చేరుకొని రైతులను దూషించడంతో రైతులు అతడిపై దాడి చేశారు. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామానికి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో సన్నరకం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి-జూలపల్లి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతున్నామని నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో నిమ్మనపల్లి గ్రామం నుంచి పెద్దపల్లికి కారులో వెళ్తున్న సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి నంబులాద్రి ఆలయ చైర్మన్ ఆట్ల కుమార్ రైతులు ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకొని రైతులకు ప్రభుత్వం ఏమి తక్కువ చేసిందని ఆందోళన చేస్తున్నారని దూషించాడు. దీంతో ఆవేదన చెందిన రైతులు నిరసనను వదిలిపెట్టి ఆట్ల కుమార్‌పై దాడి చేశారు. దీంతో రైతులకు, ప్రజాప్రతినిధికి మధ్య తోపులాట జరిగింది. తోపులాటలో నిమ్మనపల్లి గ్రామానికి చెందిన రైతు ఆకుల సంపత్ చొక్కా చినిగిపోయి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రైతులను శాంతింపచేయడంతో గొడవ సద్దుమణిగింది. కొనుగోలు కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నాయకత్వం రాజకీయ పార్టీల అంతర్గత వ్యవహారం

● హరీశ్‌రావుపై సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం ● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నాయకత్వం అనేది రాజకీయ పార్టీల అంతర్గత వ్యవహారమని, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమను సంప్రదించి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్‌ను నియమించారా? అని ప్రశ్నించారు. మహేష్ కుమార్‌గౌడ్‌ను ఎందుకు నియమించారని, దళితుడికి ఎందుకు ఇవ్వలేదని తాము అడిగామా? అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేసే పార్టీ అని, ఎవరైతే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందో వారినే బీఆర్ఎస్ ఎంచుకుంటుందని అన్నారు. దళిత ముఖ్యమంత్రి అన్నది 2014కు ముందు అని, తాము అధికారంలోకి రాలేదని, విజయ రామారావును బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్‌గా నియమించామని గుర్తుచేశారు. వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ సీఎం అయితేనే మంచిది అనుకున్నామని, పార్టీతోపాటు తెలంగాణ ముక్తకంఠంతో నిర్ణయం తీసుకుందని, అందుకే దళితుడు సీఎం కాలేదని అన్నారు. కొత్తగా వచ్చిన రాష్ట్రంలో కేసీఆర్ తప్ప ఎవరు సీఎం అయినా రాష్ట్రానికి నష్టం జరిగేదని, రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రం పరిస్థితి ఏమిటో చూస్తున్నామని అన్నారు. ఖర్గే ఏఐసీసీ డమ్మీ అధ్యక్షుడని, నడిపేదంతా రాహుల్ అనిజనానికి తెలియదా? అన్నారు. సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తప్ప కాంగ్రెస్‌లో ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పగ్గాలు దళితుడికి ఇవ్వాలంటున్న రేవంత్‌రెడ్డి ఖర్గేను పీఎం చేస్తామని ఎందుకు చెప్పడం లేదని, రాహుల్‌ని పీఎం చేస్తామని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. 50 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఇప్పటి వరకు కులగణన ఎందుకు నిర్వహించలేదన్నారు. దళితులపై కాంగ్రెస్‌ది, రేవంత్‌ది మొసలి కన్నీరని, పెదవుల మీద ప్రేమ తప్ప దళితులకు పదవులిచ్చే ప్రేమ కాదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే దామోదర రాజనరసింహను లేదా వివేక్ వెంకటస్వామిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏ నిర్ణయం తీసుకో వాలన్నా ఢిల్లీకి వెళ్లి లాబియింగ్ చేయాల్సిందేనని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడున్న పరిస్థితుల్లో మంత్రివర్గ విస్తరణచేస్తే పదవికి ఎసరు వస్తుందని భయపడుతున్నార న్నారు. బిల్లా రంగా అని తమ నేతలను సంబోధించడం ద్వారా రేవంత్ సీఎం స్థాయిని తగ్గించారని, బిల్లా రంగాల చేష్టలు రేవంత్‌వేనని అన్నారు. రేవంత్ బిల్లా రంగాల స్థాయి ఎప్పుడో దాటిపోయారని, చార్లెస్ శోభరాజ్‌ను మించిపోయారని విమర్శించారు. అంబేద్కర్‌ను ఓడించి, జగ్జీవన్‌రామ్‌ను అవమానించిన కాంగ్రెస్‌కు నీతులు చెప్పే అర్హత ఉందా?అని ప్రశ్నించారు. దళితులకు రెండుసార్లు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. రేవంత్‌కు దళితులపై ప్రేమ ఉంటే ఓ దళితుడిని సీఎం చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారంలో రేవంత్ జోక్యం తగ్గించి పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కాంగ్రెస్ చేవెళ్ల దళిత డిక్లరేషన్ అమలుపై ఆలోచించాలన్నారు. తామంతా తమ నాయకుడు కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రఘువీర్‌సింగ్, గుంజపడుగు హరిప్రసాద్, మైకెల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

● ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలు


శేఖర్(ఫైల్)

మల్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టు సమీపంలోని జగిత్యాల మార్గంలో మారుతీ టౌన్‌షిప్ ఎదురుగా గల రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కొడిమ్యాల మండలం రాంసాగర్‌కు చెందిన అనుముల శేఖర్(32) అనే యువకుడి మృతదేహం రైల్వే ట్రాక్ పక్కన పడి ఉండడంతో కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటన స్థలం పరిశీలిం చారు.

● బెట్టింగ్‌లో అప్పుల పాలై..

ఆత్మహత్యకు పాల్పడిన శేఖర్ కొన్నాళ్ల క్రితం విదేశాలకు వెళ్లి రాగా గత మూడేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొనడంతో అప్పుల పాలైనట్లు తెలుస్తోంది. సుమారు రూ.15లక్షలపైన అప్పులు కావడంతో మూడు రోజుల క్రితం సింగపూర్ వెళ్లడానికి హైదరా బాద్‌లో శిక్షణకు వెలుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. గురువారం శేఖర్ మృతదేహం రైల్వే ట్రాక్ వద్ద లభించడంతో భార్య, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి


మృతిచెందిన ఆవు

సైదాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన రైతు భూతాల బాపురావుకు చెందిన పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాడి ఆవు గడ్డి మేస్తూ ట్రాన్స్ ఫార్మర్ వద్దకు పోయింది. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో విద్యుత్ వైర్లు ఆవుకు తగిలడంతో అది అక్కడిక్కడే మృతి చెందింది.

సరస్వతి నమస్తుభ్యం..



పుష్కర స్నానం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే విజయరమణారావు



పుణ్యస్నానాలాచరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యులు



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు, నాయకులు

పుష్కరఘాట్ వద్దకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, నాయకులు

- కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభం
- పుష్కర స్నానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- తొలిరోజే పోటెత్తిన భక్తులు

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాలు గురువారం వేకువజామున ప్రారంభమయ్యాయి. కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద ఉదయం 5.40 గంటలకు పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతి పుష్కరాలను ప్రారంభించారు. తొలిరోజే పుష్కర స్నానాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు పుష్కర స్నానం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసగించారు. ఈ నెల 26 వరకు సరస్వతీ పుష్కరాలు జరుగనున్నాయి.

ఎండను సైతం లెక్క చేయకుండా

సరస్వతి నది పుష్కరాలకు భక్తులు ఎండ సైతం లెక్క చేయకుండా తరలివచ్చారు. మధ్యాహ్నం సమయంలో కూడ పుష్కర స్నానాలు ఆచరించడానికి భక్తులు నదికి రావడంతో జన సంద్రంగా మారింది. ఉదయం భక్తుల రద్దీ ఉండగా మధ్యాహ్నం వరకూ కొనసాగింది. ఎండకు వచ్చిన భక్తులు నదిలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సేద తీరారు.

భక్తుల సౌకర్యార్థం బస్సుల ఏర్పాటు

సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక బస్టాండ్ వద్ద ప్రైవేటు పాఠశాలల, సింగరేణి బస్సులను ఏర్పాటు చేశారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద నుంచి పుష్కర ఘాట్‌కు ప్రయాణికులను తరలించేందుకు సుమారు 30 బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బస్సులు ప్రయాణికులను పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ వద్ద దించి తిరిగి తాత్కాలిక బస్టాండ్ వద్దకు చేరుకుంటున్నాయి.

పుష్కర ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు

పుష్కర ఘాట్ వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మహాదేవపూర్, కాళేశ్వరానికి చెందిన 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానిక ఈతగాళ్లు రెండు షిఫ్ట్‌ల్లో అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. నదిలో భక్తులు లోతుకు వెళ్లకుండా మరో బృందం గస్తీ తిరుగుతూ భక్తులను అప్రమత్తం చేస్తుంది.

ఫొటోల కోసం క్యూ..

పుష్కరాల్లో భాగంగా సరస్వతి మాత విగ్రహం సమీపంలో, టెంట్ సిటీ, ఇతరాత్ర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దేవుడి విగ్రహాల వద్ద ఫొటోలు దిగేందుకు భక్తులు క్యూ కట్టారు.

నేడు ఉపముఖ్యమంత్రి రాక

సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం కాళేశ్వరానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నారు. ఉదయం కాళేశ్వరం చేరుకుని సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారు.

అందుబాటులో ఫైర్ వాహనాలు

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచారు. నాలుగు ఫైర్ వాహనాలు, 2 ఓపీఎమ్ బోట్లు, 40 మంది సిబ్బంది, 2 రిమోట్ కంట్రోల్ బోట్లు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి. హెలీప్యాడ్, సరస్వతీ పుష్కర ఘాట్, టెంట్‌సిటీ, టెంపుల్ వద్ద ఈ ఫైర్ ఇంజన్ వాహనాలు, అగ్నిమాపకశాఖ యంత్రాంగం అందుబాటులో ఉంటుంది.

సీఎం రాకతో దర్శనాల నిలిపివేత

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో భక్తుల దర్శనాలను అధికారులు నిలిపివేశారు. ముఖ్యమంత్రి తొలుత పుష్కర ఘాట్‌ను ప్రారంభించి న అనంతరం ఆలయానికి చేరుకుని మహాదేవుడికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నా లుగు గంటల పా టు దర్శనాలను నిలిపివేశారు. దాంతో వివిధ ప్రాం తాల నుంచి వచ్చిన భక్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.













త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు

అనాథ యువతి వివాహానికి కలెక్టరే పెళ్లి పెద్ద

- జిల్లా అధికారుల పేర్లతో వివాహ ఆహ్వాన పత్రిక

పెద్దపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): అనాథ యువతి వివాహానికి కలెక్టరే పెళ్లి పెద్దగా మారాడు... వివాహ ఆహ్వాన ప్రతికలో ఆహ్వానించు వారిలో అధికారికంగా కలెక్టర్‌తోపాటు జిల్లా పాలన యంత్రాంగం మొత్తం ఆహ్వానించిన సంఘటన పెద్దపల్లి జిల్లా రామగుండంలో జరిగింది. రామగుండానికి చెందిన తబితా అనాథ ఆశ్రమంలో తల్లిదండ్రులను కోల్పోయిన మానస 16ఏళ్లుగా చెల్లెలుతో కలిసి ఆశ్రయం పొందుతున్నది. ఆమెకు జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన రాజేశ్‌తో వివాహం నిశ్చియమైంది. యువతి వివాహానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌లు పెళ్లిపెద్దగా ఉండేందుకు అంగీకరించారు. ఆడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) జే అరుణశ్రీ, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డీ వేణుగోపాల్ ఆశీస్సుల పేర పెళ్లి ఆహ్వాన ప్రతికలను పంపిణీ చేశారు.

ఈనెల 21న ఉదయం 11.05గంటలకు పెద్దపల్లి జిల్లా కేంద్రం కలెక్టరేట్ సమీపంలోని వేంకటేశ్వర కళ్యాణ మండపంలో వీరి వివాహం జరుగనున్నది. అనాథ యువతి వివాహానికి కలెక్టర్, జిల్లా పాలన (యంతాంగమే పెళ్లి పెద్దలుగా అండగా మారడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



పెళ్లి పెద్దగా కలెక్టర్ పేరుతో పెళ్లి ఆహ్వాన పత్రిక

ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల కబడ్డీ టోర్నమెంట్

భీమదేవరపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌జిల్లాల కబడ్డీ క్రీడోత్సవాలను ఈనెల23,24,25వ తేదీల్లో భీమదేవరపల్లి మండలంలోని గాంధీనగర్ గ్రామంలో తెలంగాణ పొదుపుసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. యువత డ్రగ్స్‌కు, ఆన్‌లైన్ గేమ్, మద్యానికిబానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో యువతను క్రీడల వైపు మళ్లించి నూతన ఉత్తేజాన్నినింపాలనే ఉద్దేశ్యంతో గాంధీనగర్ అంబేద్కర్ పొదుపుసంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌జిల్లాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడాపోటీలకు సంబంధించి గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల23,24,25వ తేదీల్లో జరిగే ఈక్రీడాపోటీల్లో గెలుపొందిన మొదటిజట్టుకు రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10వేలు, నాల్గో బహుమతి రూ.5వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు, అతిథులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

మల్టీజోన్ - 1 పరిధిలో తహసీల్దార్ల బదిలీలు

- జగిత్యాల నుంచి ఇతర జిల్లాలకు నలుగురు
- ఇతర జిల్లాల నుంచి జగిత్యాలకు ముగ్గురు కేటాయింపు

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): మల్టీజోన్-1 పరిధిలోని పలువురు తహసీల్దార్లను బదిలీచేస్తూ గురువారం ల్యాండ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల నుంచి నలుగురు తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీచేయగా, ఇతర జిల్లాల నుంచి జగిత్యాలజిల్లాకు ముగ్గురు తహసీల్దార్లను కేటాయించారు. ఇందులో జగిత్యాల కలెక్టరేట్‌లోని సీసెక్షన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న తహసీల్దార్ విశ్వంబర్ నిర్మల్ జిల్లాకు, బీర్‌పూర్ తహసీల్దార్ ఎంకే ముజాబొద్దీన్ నిజామాబాద్ జిల్లాకు, ఇబ్రహీంపట్నం తహసీల్ధార్ ప్రసాద్ నిజామాబాద్ జిల్లాకు, మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అదే విధంగా కరీంనగర్‌జిల్లా నుంచి తహసీల్దార్ రాజేశ్, నిజామాబాద్‌జిల్లా నుంచి తహసీల్దార్ నాగార్జున, కొమురం భీం అసిఫాబాద్ జిల్లానుంచి తహసీల్దార్ ఉదయ్ కుమార్‌ను జగిత్యాల జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



సంత్రెడ్డి బావి వద్ద జన సందడి

సంత్రెడ్డి బావే పెద్దపల్లి స్విమ్మింగ్ ఫూల్

- వేసవి సెలవుల్లో రోజంతా రద్దీ

పెద్దపల్లిటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంత్రెడ్డి బావి స్విమ్మింగ్ ఫూల్‌గా మారింది. వేసవి సెలవులు కావడంతో పిల్లలు, పెద్దలు, విద్యార్థులతో కిటకిటలాడుతోంది. స్విమ్మింగ్‌కు మిచ్చిన వ్యాయామం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. బంధంపల్లి గ్రామ శివారులో పెద్దపల్లికి మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో సంత్రెడ్డి బావి ఉంది. కాలాలతో సంబంధం లేకుండా నిత్యం ఉదయం వేళ ఈత కొడుతుంటారు. ఉదయం ఐదు గంటలకే ఈత కొట్టేందుకు బావి వద్దకు వస్తారు. వేసవి సెలవుల్లో పిల్లలకు బావి వద్ద ఈత నేర్పిస్తున్నారు. ట్యూబ్‌లు, వాటర్ క్యాన్లతో పిల్లలకు అలవాటు చేస్తున్నారు. పలువురు వృద్ధులు సైతం ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ బావి వ్యవసాయానికి నీరందించడం వల్ల ఎప్పటికప్పుడు నీరు శుభ్రంగా ఉంటుంది. పంటలు లేని సమయంలో రెండు మూడు రోజుకొకసారి నీరు ఖాళీ చేయించి నీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుద్ధి చేస్తారు.రెగ్యులర్ ఈతకు వచ్చే వారు వాట్సప్ గ్రూప్ తయారు చేసికొని సమాచారం ఇచ్చుకుంటున్నారు.

ఈత వల్ల లాభాలు

క్రమం తప్పకుండా ఈత కొట్టడం వల్ల బరువు తగ్గించుకోవచ్చు. శారీరక శక్తి పెరగడం, అన్ని కండరాలకు వ్యాయమం జరిగి మోకాళ్ల నొప్పులు రాకుండా ఉండడం, గుండెకు సమస్యలను రాకుండా ఉపయోగపడుతుంది. నిత్యం 30 నిమిషాల నుంచి గంట ఈత కొడితే ఆరోగ్యంగా ఉండవచ్చు.

బరువు తగ్గిన..

: ఠాగూర్ రాంసింగ్



నేను ఎనిమిదేళ్ళుగా ఇదే బావిలో ఈత కొడుతున్నాను. 120 కేజీల బరువు ఉన్నవాన్ని ఇప్పుడు 90 పైచిలుకు బరువు తగ్గాను. ఏ కాలంలోనైన ఈత కొడుతుంటా.

రోజుకు గంట స్విమింగ్ చేస్తా: రాజు



రోజుకు గంట స్విమ్మింగ్ చేస్తా. ఈతతో మంచి ఆరోగ్యంగా ఉన్నాను. రోజంతా హుషారుగా ఉంటుంది. ఈతకు రాని రోజు బద్ధకంగా అనిపిస్తుంది.

కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో
చర్చలు జరపాలి

- ప్రజా సంఘాలు, సింగరేణి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఖనిలో శాంతి ర్యాలీ

కళ్యాణ్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని, చత్తీస్‌గడ్ అటవీప్రాంతలో అమలు చేస్తున్న కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలని కోరుతూ ప్రజాసంఘాలు, సింగరేణి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖనిలో ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గోదావరిఖని చౌరస్తా నుంచి రీగల్ షూ మార్ట్ సెంటర్, లక్ష్మీనగర్ కూడళ్ల మీదుగా చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం 2021 జనవరి 1 నుంచి ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌తో ఇప్పటి వరకు 510మంది ఆదివాసీలు, మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లు, దాడులలో హత్యకు గురయ్యారన్నారు. కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలనే డిమాండ్ మేరకు శాంతి చర్చలకు సిద్ధమని, ఆరు నెలల వరకు కాల్పుల విరమణ పాటిస్తున్నామని మావోయిస్టులు ప్రకటించారన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ కూడా శాంతి చర్చల జరగాలని కేంద్రానికి లేఖలు రాస్తామన్నారు. వామపక్షాలు కొన్ని నెలలుగా శాంతి చర్చలు జరగాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించలేదని, దేశవ్యాప్తంగా శాంతి చర్చలకు వస్తున్న ప్రజల ప్రజాస్వామిక డిమాండ్ మేరకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలన్నారు. ఆదివాసీల పోరాట సంఘ ఐక్యవేదిక నాయకులు ముడిమడుగుల మల్లయ్య, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉప్పులేటి పర్వతాలు, గూడూరు లవన్‌కుమార్, రత్నకుమార్, వేల్పుల కుమారస్వామి, ఎస్ సమ్మక్క, ఎస్‌కే పైముదా, లలిత, మహమ్మదీన్, రహీం, దుర్గం నగేష్, సురేష్, యాదయ్య, పాల్గొన్నారు.



ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు

బర్త్‌డే పార్టీలో వివాదం

- ముగ్గురు యువకులకు కత్తి పోట్లు
- ఒకరి పరిస్థితి విషమం

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని లింగంపేట చెరువు వద్ద గురువారం ఓ బర్త్‌డే పార్టీలో జరిగిన వివాదం కత్తి పోట్లకు దారి తీసింది. అంతర్గాం గ్రామానికి చెందిన అరవింద్, వంశీ, గంగాధర్‌పై అదేగ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడిచేశారు. గాయాలపాలైన యువకు లను జగిత్యాల ప్రధానాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కత్తిపోట్లకు గురైన యువకులలో గంగాధర్ అనే యువకునికి 25 కన్నా ఎక్కువ చోట్ల కత్తి పోట్లు పడడడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



యువకులకు చికిత్స చేస్తున్న వైద్యులు

హమాలీల షెడ్డు దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేటలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హమాలీ షెడ్డుకు నిప్పంటించారు. షెడ్డు పూర్తిగా కాలిపోయింది. ఈ విషయంపై హమాలీ కార్మికుల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. గురువారం మండలు అంటుకొని దగ్ధమైన షెడ్డును మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పరిశీలించి నిర్మాణానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌చైర్మన్ రాముడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీఎంపీటీసీలు పోశాల సదానందంగౌడ్, మొగిలి సదానందం, హమాలీ కార్మికులు ఉన్నారు.



దగ్ధమైన షెడ్డును పరిశీలిస్తున్న సారయ్యగౌడ్

ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలన



ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపల్లెలో పైలట్ ప్రాజెక్టుకింద 110 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు ఇంటి స్థలాలను గురువారం పరిశీలించామని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 600 ఫీట్లలోపు ఇంటి నిర్మాణాలు చేసుకుంటే దశలవారీగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షలు ఇస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ప్రతీ ఒక్కరు ఇల్లు కట్టుకోవాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, గాజనవేన సదయ్య పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహస్వామి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ధర్మారం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో నిర్వహించిన నృసింహస్వామి జాతర ఉత్సవాలకు సంబంధించి హుండీని గురువారం లెక్కించారు. ఈ జాతరలో మొత్తం ఆలయానికి 9,20,521 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి కొన్న కాంతరెడ్డి తెలిపారు. ఇందులో భక్తులు సమర్పించుకున్న నగదు హుండీ రూపంలో 5,12,461 రూపాయలు, వేలం పాట ద్వారా 3,47,000 రూపాయలు, టికెట్ల ద్వారా 61,060 రూపాయలు, మిశ్రమవెండి 133 గ్రాములు వచ్చింది. ఆలయ చైర్మన్ పోలుదాసరి సంతోష్, మారుతీ, పి సత్యనారాయణ, అర్చకులు, ధర్మకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదినం

పెద్దపల్లి కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు జరుపుకున్నారు. పెద్దపల్లి మండలశాఖ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మమతారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, నాయకులు లైసెట్టి భిక్షపతి, పెంచాల శ్రీధర్, పెద్ది వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొరపాటును ప్రభుత్వం సరిదిద్దితుంది

మంథని, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన కటౌట్లలో ఏదైనా పొరపాటు జరిగితే వాటిని ప్రభుత్వ యంత్రాంగం సరిద్దితుంది అని టీపీసీసీ ఎన్నికల కమిటీ సభ్యుడు శశిభూషన్‌కాచే తెలిపారు. పొరపాటు ప్రచార సంస్థదే తప్ప ప్రభుత్వ పెద్దలది కాదన్నారు. ఈ అంశంలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారు హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరించారని, జరిగిన పొరపాటుకు తాము పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నామన్నారు.

కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు కార్యవర్గం

మంథని, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల కెమిస్టు, డ్రగ్గిస్టు కార్యవర్గాన్ని గురువారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా క్యాతం కుమార్, ఉపాధ్యక్షుడిగా నూక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా కనుకుంట్ల పురుషోత్తం, సహాయ కార్యదర్శిగా ఆరె కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అరకాల కోటేశ్వర్, సలహాదారుడిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి సతీష్‌లు పాల్గొన్నారు.

శివాలయానికి ఏసీ వితరణ



ఏసీని అందజేస్తున్న మధు

పెద్దపల్లి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు నాగలింగేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన మల్క మధు ఏసీని గురువారం వితరణ చేశారు. తన కూతురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా నియామకం కావడంతో ఆలయానికి ఏసీని వితరణ చేశానని మధు తెలిపారు. కోలేటి దామోదర్, ఆలయ ప్రధానార్చకులు రాజేశ్వరశర్మ, పోతురాజుల భూమయ్య పలువురు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



ఎలిగేడు కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

ఎలిగేడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్, ధూళికట్ట ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్ సందర్శించారు. రైతులకు నష్టం కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడ్ల తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. బుక్స్ వెరిఫికేషన్, రిసీట్స్, డేటాఎంట్రీ, తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఏపీఎం సుధాకర్, సీసీలు ఆనంద్, జ్యోతి, మల్లేశం ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కళ్యాణ్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఎన్‌టీపీసీ మేడిపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, డీఎంఓ డాక్టర్ హర్షిత్ 150మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ, 2డీ ఎకో పరీక్షలు చేపట్టి రోగనిర్ధారణ చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, మేడిపల్లి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. ఎన్‌టీపీసీ టౌన్ ప్రెసిడెంట్ ఆసిఫ్ పాషా, ఎం రమేష్, మెరుగు అభిషేక్, లంబు కిషన్‌రెడ్డి, మామిడాలరాజేశం, ఆంజనేయులు, ఎండీ సలీం, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



ఎలిగేడులో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్‌శ్రీహర్ష

ఎలిగేడు, మే 15 (ఆంధ్రజ్యోతి): భూభారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎలిగేడు మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చిన ప్రతీ దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సదస్సుల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సద స్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తిచేసి పరిష్కరించాలన్నారు. విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు సంబంధిత నోటీసులు జారీ చేయాలని అన్నారు. భూభారతి చట్టం ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బం దీ చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, తహసీల్దార్ యాకన్న, డిప్యూటీ తహసీల్దార్‌లు కిరణ్‌కుమార్, తిరుపతి, ధీరజ్, ఆర్‌ఐలు జయలక్ష్మి, చంద్రశేఖర్, స్వప్న, రమ్య అనిల్, సరిత, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలి

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రస వాల సంఖ్య పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువా రం కలెక్టర్ సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని, ఎంపీడీవో, మున్సి పల్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ల సంఖ్య పెరగాలని అన్నారు. జనరల్ వార్డు, ఓపి రూము, మాతా శిశు వార్డు తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాన్పుకు దగ్గరగా ఉన్న గర్భిణీలను ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం జరిగేలా చూడాలని కలె క్టర్ తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లకు, రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శ కంగా జరగాలని, లబ్ధిదారుల వివరాలను త్వరగా కలెక్టరేట్ కు సమర్పించాలని ఆదేశించారు. సుల్తానాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల డంపింగ్ యార్డును కలెక్టర్ పరిశీలిం చారు. పట్టణ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో మరోచోట డం పింగ్ యార్డు ఏర్పాటుకు అనువైన స్థలం ఎంపిక చేయాలని కలె క్టర్ మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఎంపిడిఓ దివ్యదర్శన్‌రావు, మున్సి పల్ కమిషనర్ నియజ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న కలెక్టర్

తీరిన ఇసుక కష్టాలు

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహా రాష్ట్ర నుంచి వచ్చిన కార్మికులు పని చేస్తున్నారు. నిర్మాణ పనులపైన ఆధారపడి జీవి స్తున్న తమకు ఉపాధి లభించడం లేదని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. స్థానిక కార్మికులకు పనులు లభించేలా అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఈ ప్రాంత కార్మికులు కోరుతున్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): గోదావరి, మానే రు నదుల నుంచి స్థానిక అవసరాల కోసం ప్రజలు ఉచి తంగా ఇసుకను తీసుకోవడానికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మంథని డివి జన్‌లోని ప్రజలకు రవాణా వ్యయంతో ఇసుక చౌకగా లభిస్తుంది. ప్రజల అవస రాలకు ఫ్రీగా ఇసుక తీసుకునే అవకాశం కల్పించా లని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కలెక్టర్‌కు సూచించడంతో ఆదేశాలు జారీ చేశారు. ఈ అవకాశం డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండ లాల ప్రజలకు ఏర్పడింది. గతంలో మానేరు సూపర్ ఫైన్ ఇసుక ట్రాక్టర్‌కు రూ.3500 నుంచి 4 వేల వరకు, గోదావరి నది ఇసుకకు రూ.2 వేల నుంచి 2500 వరకు ధర పలి కింది. ఇసుక ధరలు అధికంగా ఉండటంతో నిర్మాణాలు చేపట్టే వారికి ఆర్థికంగా భారం పడుతుండేది. అధికారులు తీసుకున్న నిర్ణ యంతో ప్రభుత్వానికి సాండ్ ట్యాక్స్ చెల్లిం చేది లేకపోవడంతో ధరలు అంటుబాటులోకి వచ్చాయి. గోదావరి నది నుంచి రూ. 1200 నుంచి 1500 వరకు, మానేరు నది నుంచి రూ. 2 వేల వరకు ట్రాక్టర్‌కు యాజమానులు తీసుకుంటున్నారు.

నష్టపోయిన కుటుంబాన్ని ఆదుకుంటాం



మడకలో బాధిత కుటుంబంతో ఎమ్మెల్యే విజయ రమణారావు

ఓదెల, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అకాల వర్షం, గాలి దుమారంతో మడకలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో 25 మేకలు, గొర్రెలు మృతి చెందాయని, బాధిత కుటుంబాన్ని ఆదుకుంటానని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం మడకలో బాధితులు వేల్పుల రాజకొమురయ్యను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ తీగలు తెగిపడి మూగజీవాలు మృత్యువాత పడడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక నష్టానికి గురైందని, వారికి 15 రోజుల్లో నష్టపరిహారం అందే వరకు అండగా ఉంటానన్నారు. సిఎండి విద్యుత్ శాఖ ఉన్నత అధికారులతో మాట్లాడుతు అవసరమైనంత వరకు కుటుంబానికి సహకారం అందించాలని ఆదేశించారు. మడక కాంగ్రెస్ నాయ కులు కోట నిరంజన్ రెడ్డి, గొర్ల కొమురయ్య, సిహెచ్ మల్లేష్, గుడి జనార్దన్ రెడ్డి తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు విరాళాలు సేకరించి రూ.11 వేల 500లు, అలాగే ఎమ్మెల్యే రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని, ప్రభుత్వం నుంచి అమలయ్యే పథకాల్లో ఎలాంటి అవకాశం ఉన్న బాధిత కుటుంబానికి వర్తించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, చీకట్ల మొండయ్య, చొప్పరి రాజయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ రెడ్డి, నాగపురి రవిగౌడ్, రజనీకాంత్, సింగిల్ విండో డైరెక్టర్ చింతం కుమారస్వామి, కోట నిరంజన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, పాల్గొన్నారు.

దళిత ఎంపీని అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని, మే 15(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో ఫ్లెక్సీలలో ప్రోటోకాల్ పాటించకుండా, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫొటోను పెట్టకుండా అవమానించిన దేవాదాయ శాఖ ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు పీ మల్లికార్జున్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాళేశ్వరం వద్ద జరుగుతున్న సరస్వతీ పుష్కరాలు పెద్దపల్లి లోక్ సభ నియోజకవర్గ పరిధిలోనే జరుగుతున్నాయనే విషయం తెలిసినప్పటికీ, ఈ ప్రాంతానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డం వంశీకృష్ణ దళితుడైనందుకే దేవాదాయ శాఖ ఆఫీసర్లు ఆయనకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఫొటోను ప్లెక్సీలలో ఏర్పాటు చేయలేదని ఆయన పేర్కొన్నారు. దళిత ఎంపీ పట్ల వివక్ష చూపుతున్న దేవాదాయ శాఖతో పాటు ఇతర శాఖల ఆఫీసర్లపై కూడా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పార్లమెం ట్ ప్రోటోకాల్ విభాగం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న హాసిని

ముత్తారం, మే 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో ముత్తారం మండలం దరియాపూర్ మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థిని హాసిని రెండు మెడల్స్ సాధించారు. ఈనెల 9, 10, 11 తేదీలలో మలేషియాలోని ఐపో సిటీలో పోటీలు జరిగాయి. హాసిని బాలికల సీనియర్ కేటగిరి కటా విభాగంలో గోల్డ్ మెడల్, కుమిటి (61కేజీ) విభాగంలో రజత పతకం గెలుచుకున్నారు. దరియాపూర్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సంతోష్, సిబ్బంది హాసినికి శుభాకాంక్షలు తెలిపారు.

మున్నూరు కాపు కులస్తులు అన్ని రంగాల్లో సత్తాచాటాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

పెద్దపల్లిటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు కులస్తులు అన్ని రంగాల్లో సత్తాచాటాలని, కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేపట్టే జనగణనతో రాష్ట్రంలో మున్నూరు కాపుల లెక్క పక్కా తేల్చాలని మున్నూరు కాపు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో దాదాపు 40 లక్షల వరకు ఉన్న మున్నూరు కాపు జనాభా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగననలో తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్నూరు కాపులు సర్వే సందర్భంగా పేర్ల చివరన పటేల్ అని నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపులు కానీ వారు కూడా పదవుల్లో ఉండి పెత్తనం చెలాయిస్తున్నారని, అలా జరగకుండా కేవలం మున్నూరు కాపుల బలాన్ని చాటాలన్నారు. ఏ పార్టీలు అధికారంలో ఉన్నా మున్నూరు కాపులకు అన్యాయమే జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం భవనాల నిర్మాణానికి నిధులు ఇస్తూ 2 ఎకరాల చొప్పున స్థలం కేటాయించాలని కోరారు. ఇందులో భాగంగా గ్రామ స్థాయిలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు ఓటు హక్కు కల్పించి రాష్ట్రస్థాయిలో ప్రజాస్వామ్య బద్ధంగా ఓట్ల ద్వారా రాష్ట్ర కమిటీ నియామకానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంట రాజేష్, నాయకులు తూముల శ్రీనివాస్, మహేష్, కందుకూరి అంజయ్య, దండె వెంకటేశ్వర్లు, దొడ్ల మహేందర్, సాయి, బైరెడ్డి సాగర్, పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని మూడు రోజుల్లోగా పూర్తిగా కొనుగోలు చేయాలని లేకుంటే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడిస్తామని బిజెపి జిల్లా కన్వీనర్ మేకల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండ లంలోని చీకురాయి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని, అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, ఒల్లే తిరుపతి, మామిడి ఉమేష్, పెంచాల శ్రావణ్, రైతులు రంగస్వామి, మల్లేశం, చిలుకల ఉషాలు, సమ్మయ్య, మేకల సమ్మయ్య పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ముత్తారం, మే 15 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు కోరారు. గురువారం మచ్చుపేట, మైదా బండ, హరిపురం, కేసనపల్లి, కాసర్లగడ్డ, ముత్తారం తదితర గ్రామాల్లో ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ముత్యంరావు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ చేయించాలని, 55 సంవత్సరాల నిండిన కార్మికునికి నెలకు 9000 పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. బూడిద గణేష్, వెంకటేష్, రాజమల్లు, ప్రసాద్, సమ్మయ్య, నరసయ్య, శంకర్, తిరుపతి, రాజయ్య, మల్లయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

తరగతి గదులకు నిధులు మంజూరు

సుల్తానాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల ఏర్పాటుకు కోటి నలభై లక్షల రూపాయలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళా శాలలో అదనపు గదులు నిర్మించాలని ఎమ్మె ల్యే కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు చేశారనీ ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థికసాయం

సుల్తానాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): నారాయణపూర్ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కల్లెపల్లి శంకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు గ్రామస్థులు రూ.16 వేలు అందజేశారు. పేద కుటుంబం కావడం, తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతున్న విషయమై దాతలు సహకరించాలని మాజీ ఎంపిటిసి మండల రమేష్ సామాజిక మాధ్యమం ద్వారా విజ్ఞప్తి చేయగా దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించారు. దాతల ద్వారా సేకరించిన 16 వేల రూపాయలను గురువారం మృతుడి సోదరి ప్రమీలకు అందించారు. గ్రామ ప్రజలు, అంబెడ్కర్ కాలని పెద్దలు పాల్గొన్నారు.

రేపు అండర్ 25 క్రికెట్ సెలక్షన్స్

కోల్‌సిటీటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న గోదావరిఖనిలో అండర్ 25 టీం ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా ఇంచార్జి కిరణ్‌కుమార్ ప్రకనటలో పేర్కొన్నారు. పెద్దపల్లి, మథని, రామగుండం నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులు గోదావరిఖని జీఎం కాలనీ గ్రౌండ్ ఉదయం 9 గంటలకు జరిగే ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు 1.9.2000 తర్వాత జన్మించి ఉండాలని, సొంత క్రికెట్ కిట్లు తెచ్చుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో ఎస్ఎస్‌సీ, ఇంటర్ మెమో, ప్రస్తుత ఇంటర్ బోనోఫైడ్ సర్టిఫికేట్లు తీసు కురావాలని నిర్వాహకులు తెలిపారు. వివరా లకు 9866351620 నంబర్‌లో సంప్రదించాలని కిరణ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.



సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

రామగిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో జేఏసీ నాయకులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్‌కోడ్‌లను ఏర్పాటు చేసిందని వాటిని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. సింగరేణికి చెల్లించాల్సిన అప్పు సుమారు 40 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను కార్మికలోకం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జేఏసీ నేతలు సారయ్య, కోటరవీందర్‌రెడ్డి, ముత్యంరావు, మిర్యాలరాజిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేద్దాం



నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం సవరించిన లేబర్‌కోడ్‌లను రద్దు చేసేలా సంఘటితంగా సమ్మెను విజయవంతం చేద్దామని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఓసీపీ-3లోని ఎస్అండ్ డీ, బేస్‌వర్క్‌షాప్‌లలో జరిగిన గేట్‌మీటింగ్‌లో జేఏసీ నాయకులు మాట్లాడారు. రాజకీయ పార్టీలు, యూనియన్లకు అతీతంగా ప్రతి కార్మికుడు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ ఇఫ్టూ నాయకులు ఎల్ ప్రకాష్, రాజారత్నం, రవీందర్‌రెడ్డి, అయిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, మే 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో సింగరేణి రామగుండం రీజియన్‌ల ఏరియాల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 18వ తేదీన గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే జాబ్‌మేళాకు 7వ తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన నిరుద్యోగులు హాజరుకావచ్చని, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని జీఎం తెలిపారు. సుమారు 100కు పైగా కంపెనీలు పాల్గొని, ఆయా కంపెనీల ఖాళీలను బట్టి విద్యార్హతలు ఉన్నవారికి ఉద్యోగాలు ఇస్తాయని జీఎం బండి వెంకటయ్య తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌కు సింగరేణి బొగ్గు

హైదరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దుర్గాపూర్‌లో ఉన్న ఎన్ఎస్‌పీసీఎల్ థర్మల్ ప్లాంట్‌కు 5లక్షల టన్నుల బొగ్గును సింగరేణి సరఫరా చేయనుంది. ఆ మేరకు సింగరేణితో ఆ సంస్థ ఒప్పందం చేసుకుంది. దీంతో ఒప్పందాలపై అధికారులు సంతకాలు చేశారు. ప్రముఖ జాతీయ విద్యుత్ ఉత్పత్తి సంస్థ అయిన ఎన్‌టీపీసీ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో ఎన్ఎస్‌పీసీఎల్‌ను ఏర్పాటు చేశారు. సింగరేణి సంస్థ నాణ్యత గల బొగ్గును సకాలంలో అందజేస్తుందని, అందుకే ఆ కంపెనీతో బొగ్గు కొనడానికి ముందుకు వచ్చామని ఎన్ఎస్‌పీసీఎల్ అధికారులు తెలిపారు.